క్లుప్తంగా

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


గంగకు వెళ్తున్న యాదవ సంఘం సభ్యులు

నర్సాపూర్: పట్టణంలోని కేతకి భ్రమరాంభ సమేత మరకత మల్లికార్జున స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు యాదవ సంఘం ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం భక్తులు గంగకు వెళ్లడం, దేవునికి అభిషేకం తదితర పూజలు స్వామివారికి భక్తిశ్రద్ధలతో చేశారు. కాగా ఒగ్గు కళాకారులు ఆలయ ఆవరణలో ఒగ్గు కథ చెప్పారు.

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం


స్వామివారి కల్యాణోత్సవంలో భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో కొలువైన మల్లికార్జున స్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గ్రామంలో బోనాలు, పట్టు వస్త్రాలు, తలంబ్రాలను ఊరేగించి దేవాలయానికి డోలు చప్పుల్ల మధ్య తీసుకొచ్చారు. ఆలయ సన్నిధిలో వేసిన పచ్చని పందిట్లో స్వామివారి కల్యాణోత్సవ వేడుకలను నిర్వహించారు. అంతకుముందు స్వామి వారి కథ కాలక్షేపాన్ని గొల్ల సుద్దులు వినిపించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న మహిళలు అమ్మవారికి స్వామివారికి ఓడిబియ్యాన్ని సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ సన్నిధిలో అగ్నిగుండాలు తొక్కారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

గ్రంథాలయం స్వచ్ఛతే లక్ష్యం


గ్రంథాలయాన్ని శుభ్రం చేస్తున్న చిన్నారులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారంలో గ్రంథాలయం స్వచ్ఛతే లక్ష్యంగా నేచర్ ఐకాన్ యువత స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఆదివారం కూచారం గ్రామంలోని గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో యువత 297వ వారం స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రంథాలయం నుంచి సామగ్రి, పుస్తకాలను, వేరే భవనానికి తరలించి, గ్రంథాలయాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ.. గ్రామస్తులకు అందుబాటులో ఉన్న గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తాను సన్మానిస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం నార్సింగికి వచ్చిన నిజామాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాను శనివారం రాత్రి బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు చంద్రశేఖర్, మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి సత్యపాల్ రెడ్డి, లక్ష్మణ్, నరేష్, సత్యం, అఖిల్ రెడ్డి, రాజశేఖర్, సిద్దిరాములు, చరణ్ ఉన్నారు.

డ్రిప్ పైపుల దగ్ధం


మంటల్లో డ్రిప్ పైపులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రం నిజాంపేటలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు గ్రామానికి చెందిన రైతు పొలంలోని డ్రిప్ పైపులను దగ్ధం చేశారు. ఈ మేరకు మండల కేంద్రానికి చెందిన గరుగుల సుధాకర్ వ్యవసాయ భూమిలో ఉన్న డ్రిప్‌పైపులను గుర్తు తెలియని దుండగులు దగ్ధం చేశారు. మంటలను గమనించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు వెళ్లేలోపే మంటల్లో పైపులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. బాధితుడు రైతు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

నిరుపయోగంగా పాత రైతుబజార్

- కొత్తది పిల్లర్లకే పరిమితం..
- రోడ్డు పక్కనే కూరగాయల విక్రయాలు

రామాయంపేట(మెదక్): పట్టణంలో ఐదేళ్ల క్రితం రూ. 50 లక్షలతో నిర్మించిన రైతుబజార్ నిరుపయోగంగా మారింది. కొత్త భవన సముదాయ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మార్కెట్ కొనసాగే ప్రదేశంలో కాకుండా అదరాబాదరాగా స్థలం ఎంపిక చేసి రైతు బజార్ దుకాణాల సముదాయం నిర్మించారు. దీంతో అటు వైపునకు ఎవరూ వెళ్లడం లేదు. కేవలం మాంసం వ్యాపారులు కొందరు మాత్రమే రైతుబజార్‌లో అమ్మకాలు కొనసాగిస్తున్నారు. దీనికి తోడు సరైన పార్కింగ్ సదుపాయం లేకపోవడం మరో సమస్యగా మారింది. దీనితో మళ్లీ పాత పద్ధతే ముందుకొచ్చింది. దీంతో మార్కెట్‌ను ఎత్తివేసి తాత్కాలికంగా జూనియర్ కళాశాల ఎదురుగా సీఎస్ఐ అధీనంలో ఉన్న స్థలంలో ప్రస్తుతం మార్కెట్ కొనసాగుతోంది. కాగా ప్రతీ బుధవారం జరిగే సంత మాత్రం పట్టణం మధ్యలో ఇరుకు స్థలంలో దూలి మధ్య సంత కొనసాగుతుండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అలాగే చెత్త చెదారంతో కూరగాయలు కలుషితమవుతున్నాయి.


రైతు బజారులో నిరుపయోగంగా దుకాణ సదుపాయం

కొత్త కాంప్లెక్స్ పిల్లర్లకే పరిమితం



రామాయంపేటలో ఆధునాతన రీతిలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ సముదాయం నిర్మాణానికి ఏడాది నిధులు మంజూరయ్యాయి. స్థలం అనువుగా లేకపోయినా ఎంపీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో ఏడాది క్రితం నిర్మాణం పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పిల్లర్లస్థాయిలో పనులు నిలిచిపోయాయి. నిధుల సరిపోకపోవడంతోనే అసంపూర్తిగా నిలిచిపోయింది.

ట్రాఫిక్ సమస్య

ప్రతీ బుధవారం పట్టణంలో సంత కొనసాగుతుండగా, ఇరుకు రహదారిపై వ్యాపారులు రెండు వైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ఈ సంతకు జిల్లా వాసులతో పాటు పొరుగున ఉన్న కామారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన వందలాది మంది వస్తుండగా, అత్యంత రద్దీ నెలకొంటుంది. మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేశారు.


రోడ్డు పక్కనే ఇరుకు స్థలంలో కొనసాగుతున్న సంత

వ్యాపారానికి అనువుగా లేదు



రైతుబజార్ కూరగాయల వ్యాపారానికి అనువుగా లేదు. ఇందులో అన్నీ సమస్యలే నెలకొన్నాయి. పార్కింగ్ స్థలంతో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఇక్కడికి రావడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. కొత్త భవన నిర్మాణం పూర్తి చేసి, అందులో పూర్తి స్థాయిలో వసతులు సమకూర్చాలి.

– దుర్గయ్య, కూరగాయల వ్యాపారి

కాంప్లెక్స్ నిర్మాణానికి కృషి



రామాయంపేటలో అసంపూర్తిగా నిలిచిపోయిన వెజ్, నాన్‌వెజ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేయించడానికి కృషి చేస్తున్నాం. ఈ మేరకు అసంపూర్తిగా నిలిచిపోయిన పనులకు సంబంధించి వివరాలు ప్రభుత్వానికి పంపించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. పాత రైతుబజార్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తాం.

– ఉమాదేవి, మున్సిపల్ కమిషనర్

శాస్త్రీయమైన విద్య కోసం ఉద్యమిద్దాం

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్
- ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవాలు

మెదక్ కలెక్టరేట్: శాస్త్రీయమైన విద్య విధానం కోసం ఉద్యమిద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ పిలుపునిచ్చారు. ఆదివారం మెదక్‌లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 54వ ఆవిర్భావ దినోత్సవాలను జరుపుకొన్నారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగన్ పాల్గొని పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం పేరుతో కార్పొరేట్ వారికి లాభం చేకూరేలా చేస్తుందని ఆరోపించారు. మరోవైపు పేద విద్యార్థులు చదువుకు దూరం చేసే కుట్ర చేస్తుందన్నారు. ఈ నూతన జాతీయ విద్యావిధాన రద్దుకు మేధావులు, విద్యార్థులను కలుపుకొని పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చందు, రవి, రాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆపదలో మహిళలకు షీటీమ్ అండ

మెదక్ మున్సిపాలిటీ: ఆపదలో ఉన్న మహిళలు, విద్యార్థులకు, షీటీమ్ భరోసా కల్పిస్తుందని అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ పేర్కొన్నారు. డిసెంబర్ నెలరోజుల పాటు షీటీమ్ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలను ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ముగ్గురు ఈవ్ టీజర్స్‌ను పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈవ్ టీజర్స్ పట్టుకొని ఐదు గురికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. జిల్లాలోని 197 సార్లు హాట్ స్పాట్‌ల సందర్శించి 29 అవగాహన కార్యాక్రమాలు నిర్వహించాని చెప్పారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ – 100 లేదా షీటీమ్ వాట్సాప్ నంబర్ 87126 57963, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 08452 – 223533లకు ఫోన్ చేసినచో వెంటనే స్పందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో డీఎస్పీలు ఫణీంద్ర, యాదగిరి రెడ్డిలతో పాటు షీటీమ్ బృందాలు పాల్గొన్నట్లు తెలిపారు.

ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్: జిల్లాలోని అన్ని వర్గాల ఉద్యోగులకు టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వం నూతన సంవత్సరంలో అన్ని వర్గాల ఉద్యోగులకు అండగా నిలిచి వారికి రాజ్యాంగ బద్ధంగా వచ్చే ప్రయోజనాలను ఎటువంటి ఆటంకం అలసత్వం లేకుండా అమలుచేయాలన్నారు. అదే సమయంలో ఉద్యోగులందరూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేకూర్చేలా సమర్థవంతంగా తమ విధులు నిర్వర్తించి, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ముందుకు తీసుకెళ్లాలన్నారు. 2024 ఏడాది జిల్లా ఉద్యోగులకు శుభాలను చేకూర్చాలని అన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా

ములుగు(గజ్వేల్): కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఆరు గ్యారంటీల పథకాలను అందజేస్తుందని ములుగు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా అన్నారు. మండలంలోని అల్లీనగర్ గ్రామంలో ఆదివారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ కర్తవ్యమన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన విధంగా అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేసి తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని నిరూపించామన్నారు. అభయ హస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పారదర్శకంగా దరఖాస్తుల స్వీకరణ చేపడుతున్నట్లు చెప్పారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరూ ఆరు గ్యారంటీలు పొందడానికి దరఖాస్తు చేసుకోవచ్చని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి రాజకీయ వివక్షతకు తావులేదన్నా రు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు రాములుగౌడ్, ఉపాధ్యక్షుడు రవి, ఉపసర్పంచ్ కొము రయ్య, నాయకులు భూపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాజుయాదవ్, నర్సింహులు, మల్లేష్‌యాదవ్, నయీ మొద్దీన్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.


అల్లీనగర్‌లో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ గుప్తా

మదన్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వాలి

నర్సాపూర్: నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డికి బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఇవ్వాలని పార్టీ నాయకుడు, వ్యాపారి శ్రీధర్‌గుప్తా కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మదన్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తామని పార్టీ హామీ ఇచ్చిన నేపథ్యంలో ఆయనకు ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరారు.

పరామర్శ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం నర్సంపల్లిలో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సుభాష్ కుటుంబీకులను జెడ్పీటీసీ కృష్ణారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మృతుడి కుటుంబీకులకు తనవంతుగా ఆర్థిక సాయం అందించారు. ఎంపీటీసీ సత్యనారాయణ, నాయకులు రవీందర్ ఉన్నారు.

శ్రీకృష్ణుడికి మధురాభిషేకాలు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో శ్రీ కృష్ణ భగవానుడికి ఆదివారం భక్తులు 116 కిలోల చక్కరతో మధురాభిషేకాలు నిర్వహించారు. గీతా పారాయణంలో భాగంగా ఆదివారం తొమ్మిదో అధ్యాయం పారాయణం పూర్తిచేశారు. స్వామివారికి మధురాభిషేకాలతోపాటు మహిళలు మంగళ హారతులతో సామూహిక పూజలు చేశారు. ఈ సందర్భంగా వైదిక నిర్వాహకుడు రాజపున్నయ్య శర్మ మాట్లాడుతూ 18 రోజుల పాటు భగవద్గీత 18 అధ్యాయాల సామూహిక పారాయణం కొనసాగుతుందన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు


కొడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


భక్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులతో రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు తీసి ఓడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద పలువురు భక్తులు వాహనాలకు పూజలు చేయించడంతో పాటు తలనీలాలు సమర్పించారు. ఆలయం వద్ద డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు, ధర్మకర్తలు ఏర్పాట్లు చేశారు.

చాముండేశ్వరి అమ్మవారికి..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి ఓడిబియ్యం పోశారన్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశామన్నారు.


నర్సాపూర్ రూరల్: గొల్లపల్లిలో ..

గొల్లపల్లిలో..

నర్సాపూర్ రూరల్: మండల పరిధిలోని గొల్లపల్లిలో వెలిసిన కేతకి భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో ఆలయ ఫౌండర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు వాల్దస్ మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు హరి ప్రసాద్ శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

భారత్ గ్యాస్ ఆధ్వర్యంలో ఈకేవైసీ

మనోహరాబాద్(తూప్రాన్): ప్రతీ గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ ఉండాలని అనడంతో గ్రామస్తులకు ఇక్కట్లు కాకుండా కాళ్లకల్ గ్రామంలో ఆదివారం గ్రామ పంచాయతీ వద్ద ఈకేవైసీ చేపట్టినట్లు చేగుంట దేవి గ్యాస్ కేంద్రం ప్రతినిధులు తెలిపారు. కాగా ఎంపీటీసీ లావణ్య ఈకేవైసీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్యాస్ వినియోగదారులకు ఇబ్బందులు కాకుండా గ్రామానికే వచ్చి అందరితో ఈకేవైసీ చేయడం సంతోషకరమన్నారు. కాగా గ్రామస్తులు ఉదయం నుంచే బారులు తీరి తమ ఈకేవైసీని ఆన్‌లైన్‌లో చేయించుకున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు కాకుండా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.


ఈకేవైసీ చేయించుకుంటున్న ఎంపీటీసీ లావణ్య

సికింద్లాపూర్‌లో ధనుర్మాస పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో కొలువైన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఆలయ అర్చకులు ధనుంజయ్ శర్మ, విద్యాకర్‌చారి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేరులో స్నానం ఆచరించి ఆలయంతో పాటు గుట్టపై కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని పలువురు భక్తులు కాలినడకన దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాల్లో వంటావార్పు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ శశిధర్‌గుప్తా, సిబ్బంది నర్సింహరెడ్డి, తదితరులు ఉన్నారు.

ముగిసిన గ్రామ దేవతల ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో గ్రామ దేవతల ఉత్సవాలు కనుల పండువగా ముగిశాయి. బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఊరడమ్మకు గావు రంగం చేశారు. అర్చకుడు బాబురావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతలు ఉత్సవాల నిర్వహణకు కృషి చేసిన వారందరికీ సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని గ్రామ దేవతలకు వేడుకున్నట్లు ఆయన చెప్పారు. భక్తజనంతో గ్రామ పరిసరాలు నిండిపోయాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్ గుప్తా, ఆత్మకమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఉన్నారు.


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆసుపత్రి అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రి అభివృద్ధికి దాత లు ముందుకు రావాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆసుపత్రిలో రోగులు కూర్చునేందుకు దుబ్బాక మున్సిపల్ బీఆర్ఎస్ మహి ళా విభాగం అధ్యక్షురాలు దాత్రిక భాగ్యలక్ష్మి 30 కుర్చీలు ఆదివారం బహూకరించారు. ఎమ్మెల్యే ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఆసుపత్రి దేవాలయంతో సమానమన్నారు. పేద రోగులకు వైద్యసేవలు అందించే ఆసుపత్రిని అభివృద్ధి చేసుకుందామన్నారు. దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మలుపులు.. మృత్యువుకు పిలుపులు

వెల్దుర్తి(తూప్రాన్): మూల మలుపులు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. మండలంలోని ధర్మారం గేటు, ఉప్పులింగాపూర్ బ్రిడ్జ్, దామరంచ, ఎం.జలాల్‌పూర్ గ్రామాల మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. డిసెంబర్ 3న ధర్మారం గేటు మూలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శివ్వంపేట మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన దొంతి లక్ష్మాగౌడ్(48) అక్కడికక్కడే మృతి చెందాడు. జూన్ 11న దామరంచ మలుపు వద్ద శివ్వంపేట గ్రామానికి చెందిన ఓ కానిస్టేబుల్ ప్రమాదానికి గురయ్యాడు. ఇలా నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, రోడ్డుకు ఇరువైపుల పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరిగి వాహనదారులు మృత్యువాత పడుతున్నారు.


ధర్మారం గేట్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

ఆయా రూట్లలో వెళ్లాలంటే ప్రాణాన్ని గుప్పిట్లో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి. వాహనం వేగంగా ఉన్నా.. ఆదమరిచి వాహనం నడిపినా ప్రమాదాల బారిన పడే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.


ధర్మారం గేట్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రైతు లక్ష్మాగౌడ్ (ఫైల్)